క్లుప్తంగా

1,357 ట్యాబ్‌ల మంజూరు



ట్యాబ్‌లను అందజేస్తున్న ఎంఈఓ నాగేశప్ప

కోసిగి: మండలంలోని 8వ తరగతి విద్యార్థులకు 1,357 ట్యాబ్‌లు వచ్చాయని ఎంఈఓ నాగేశప్ప తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంకు వచ్చిన ట్యాబ్‌లను సీఆర్‌పీల ఆధ్వర్యంలో పాఠశాలల వారీగా కేటాయించారు.ఈ సందర్భంగా మండలంలోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతిలో 1,357 మంది విద్యార్థిని, విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. ఈనెల 22వ తేదీన హెచ్‌ఎంల ద్వారా వారికి అందేలా చర్యలు చేపట్టామన్నారు. సీఆర్‌పీలు ఉశేని,యోహాన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు వీరారెడ్డి, నరేంద్ర ఉన్నారు.

ఆదోనిలో చైన్ స్నాచింగ్



బాధితురాలు ఆదిలక్ష్మి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని చిన్నమార్కెట్‌లో మార్కండేయ స్వామి గుడి వద్ద చైన్‌స్నాచింగ్ ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. ఎస్‌కేడీ కాలనీకి చెందిన ఆదిలక్ష్మి ఇంటి నుంచి శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆలయానికి బయలుదేరారు. చిన్నమార్కెట్‌లో ఉన్న మార్కండేయ గుడి వద్ద నడిచి వెళుతుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైకుపై వెంబడించి మెడలో ఉన్న గోల్డ్ చైన్ లాక్కొని వెళ్లిపోయారు. గోల్డ్ చైన్ ఆరున్నర తులాలు ఉంటుందని బాధితురాలు వాపోయారు. వెంటనే ఆమె త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా విచారణ చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంత్రాలయం : మండలంలోని సుంకేశ్వరి గ్రామంలోని బీరప్ప తాత గుడి వద్ద పేకాట ఆడుతున్న కురువ లింగప్ప, కురువ భీరప్ప, కురువ కాడప్ప, కురువ నాగిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు మాధవరం ఎస్‌ఐ కిరణ్ తెలిపారు. శుక్రవారం పేకాట ఆడుతుండగా వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.5,630 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కూలీలకు వేతనాలు ఇవ్వాలి

ఆదోనిరూరల్: ఉపాధిహామీ పథకంలో పని చేసిన కూలీలకు మూడు నెలలుగా వేతనాలు అందలేదని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని మదిర గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. గ్రామంలో పనులు ప్రారంభించి 11 వారాలైనా ఉపాధిహామీ వేతనాలు నేటికీ చెల్లించలేదని, తామెలా బతకాలని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ యేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల తప్పని పరిస్థితుల్లో కూలీలు వలసలు వెళ్తున్నారన్నారు. హైదరాబాద్, గుంటూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లడం జరిగిందన్నారు. గత రెండు రోజులుగా గణేకల్, పాండవగల్ గ్రామాల నుంచి దాదాపు 10 వాహనాల్లో 200 కుటుంబాలు వలసబాట పట్టాయని, సంబంధిత అధికారులు వలసవెళ్లే కూలీలను ఆపే ప్రయత్నం కూడా చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్థానికంగా ఉపాధి పనులు కల్పించి, సక్రమంగా వేతనాలు అందేలా చూడాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన గొల్ల నరసింహారెడ్డి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని మలుపు వద్ద శుక్రవారం రాత్రి ఎదురుగా వస్తున్న లారీని బైక్ ఢీకొనడంతో గొల్ల నరసింహారెడ్డి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. నందవరం మండలం ముగతికి చెందిన గొల్ల నరసింహారెడ్డి, భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలతో కర్నూలు బళ్లారి చౌరస్తాలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. నరసింహారెడ్డి డీ-మార్ట్‌లో పనిచేస్తుండగా భార్య జ్యోతి వేరే చోట పనిచేస్తుంది. సంక్రాంతి సెలవులు కావటంతో భార్య, పిల్లలతో తన పుట్టినిల్లు అయిన తెలంగాణలోని ఐజ మండలం బింగిదొడ్డి గ్రామానికి వెళ్లింది. సెలవులు ముగుస్తుండడంతో నరసింహారెడ్డి భార్య ఊరికి వెళ్లి భార్య, పిల్లలను బైక్‌పై తీసుకొచ్చి తన స్వగ్రామం ముగతిలోని తల్లిదండ్రుల వద్ద వదిలారు. అక్కడి నుంచి నరసింహారెడ్డి కర్నూలుకు బైక్‌పై బయలుదేరాడు. ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని మలుపు వద్ద ఆదోని వైపు వస్తున్న డీసీఎం లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. తలకు బలమైన గాయం కావడంతో చెవులు, ముక్కు నుంచి రక్తస్రావం అవుతోంది. కుడి చెయ్యి విరిగిపోయింది. గాయపడ్డ వ్యక్తిని 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఏఎస్‌ఐ బాలనాయక్ తెలిపారు.

పశు బీమా.. పాడి రైతుకు ధీమా



జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారులు

ఆదోని సెంట్రల్: పాడి రైతులు నష్టపోకుండా బీమా పథకం ద్వారా ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోంది. పాడి పశువులు మరణిస్తే నష్టపోయిన పశుపోషకులకు పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టింది. ఈ మేరకు రైతులు తమ పశువులకు నామమాత్రపు రుసుము చెల్లించి బీమా చేయించుకునేలా అప్రమత్తం చేయాలని పశు సంవర్ధక సహాయకులకు ప్రభుత్వం సూచనలు చేసింది. ఆదోని డివిజన్‌లో మొదటి విడతలో 3500 పశువులకు బీమా చేయించారు. అలాగే ఇప్పటివరకు బీమా చేయించని పాడి రైతులు తమ పశువులకు కూడా బీమా చేయించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పశుబీమా పథకం ఇలా

- పశు బీమా పథకంలో ఆవులు గెదెలతో పాటు ఎద్దులు, గొర్రెలు, మేకలతో పాటు పందులకు కూడా బీమా చేయించవచ్చు. గతంలో ఎద్దులు, పందులు ఈ బీమా పథకంలో లేవు.
- ఒక కుటుంబంలో 5 పశువులకు 50 జీవాల వరకు పశుబీమా చేసుకునేందుకు అవకాశం ఉంది.
- ఉత్పాదక దశలో ఆవులకు 2 నుంచి 10 సంవత్సరాల వయస్సు ఉండాలి. ఒక ఈతనైనా పాలిచ్చినవై ఉండాలి.
- గేదెలకు 3 నుంచి 12 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి
- మేలు జాతి ఎద్దులు, దున్నపోతులు పనిచేసేవిగా ఉండాలి
- విదేశీ జాతికి ఏడాదిన్నర నుంచి పదేళ్లు, దేశీయ జాతివైతే రెండేళ్ల నుంచి పదేళ్ల వయస్సు ఉండాలి.
- గొర్రెలు, మేకలకు 6 నెలలు వయస్సు ఉండాలి.

పశు బీమా ప్రీమియం చెల్లింపు ఇలా..

- రేషన్ కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.30 వేలు విలువ చేసే పశువుకు మూడేళ్ల కాలవ్యవధికి రూ.384 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పెద్ద రైతులైతే రూ.960 ప్రీమియం చెల్లించాలి.
- పశువులకు రూ.30 వేలకు పైబడి ఉంటే 6.4 శాతం అధికంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- ఇక గొర్రెలు, మేకలకు ఏడాదికి, రెండేళ్లకు, మూడేళ్లకు బీమా చేయించుకోవడానికి అవకాశం ఉంది.
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి రైతు ఒక గొర్రె లేదా మేకకు ఏడాదికి రూ.36 ప్రీమియం చెల్లించాలి. రెండేళ్లకు రూ.54, మూడేళ్లకు రూ.75 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- పెద్ద రైతు కుటుంబాల వారైతే ఏడాదికి ఒక గొర్రెకు గానీ మేకకుగాని రూ.90 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్లకు అయితే రూ.135, మూడేళ్లకు అయితే రూ.187.50 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది.
- గొర్రెలు గానీ, మేకలు గాని చనిపొతే ఒక దానికి రూ.6000 చొప్పున 50 వరకు జీవాలకు పరిహారం చెల్లిస్తారు.

సద్వినియోగం చేసుకోండి



పాడి కలిగిన ప్రతి రైతు వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి పాడి రైతు మూడేళ్ల కాల వ్యవధికి గాను రూ.384 ప్రీమియం చెల్లించి పశు బీమా చేయించుకోవచ్చు. పెద్ద రైతులైతే రూ.960 చెల్లించాల్సి ఉంటుంది. ప్రమాదవశాత్తు పశువు మరణిస్తే రూ.30 వేలు పరిహారం చెల్లిస్తారు. గొర్రెలకు లేదా మేకలకు రూ.6000 చొప్పున పరిహారం అందుతుంది. రైతులు నమమాత్రపు ప్రీమియం చెల్లించి పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పీవీ రమణ, పశుసంవర్ధక శాఖ డీడీ, ఆదోని

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోనిఅర్బన్: పట్టణంలో 220 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనుండడంతో శనివారం స్థానిక ఇండోర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ పురుషోత్తం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పట్టణంలోని ప్రధాన రహదారులు, కాలనీలు, కార్యాలయాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలి

పెద్దకడబూరు: ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చంద్ర, ఏఐఎస్‌ఎఫ్ తాలుకా అధ్యక్షుడు జాఫర్ పటేల్ కోరారు. మండలంలోని కల్లుకుంట గ్రామంలో సచివాలయం ఎదుట శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మా ట్లాడుతూ గత 10 వారాలుగా ఉపాధి కూలీల కు వేతనాలు అందకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని తక్షణ మే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. నాయకులు భీమన్న, దూద పీరా, ఉసేని, రాముడు, శాంత పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



క్రాంతినగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కుటుంబసభ్యులు

ఆదోనిటౌన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు మనోజ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక 24వ వార్డు క్రాంతినగర్, న్యూగాంధీనగర్‌లో శుక్రవారం కౌన్సిలర్ సిద్ద క్రిష్ణవేణి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి కుటుంబసభ్యులు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి ఒక వీధిలో, మరొక వీధిలో కుమార్తె గౌతమిరెడ్డి, మరో వీధిలో కోడలు హిరణ్మయిరెడ్డి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సమస్య ఉన్నా తమదృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యేకు తెలియజేసి పరిష్కారమయ్యేలా చూస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. క్రాంతినగర్‌లో కంకరతేలి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని, కాలువలు, కల్వర్టులు నిర్మించాలని ఆ ప్రాంతం ప్రజలు మనోజ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని చెబుతూ ముందుకుసాగారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, డైరెక్టర్లు మంజుల, రేణుక, చైర్‌పర్సన్ బోయ శాంత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు దేవా, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, నాయకులు సిద్దమల్లికార్జున, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా కులగణన

ఆదోనిటౌన్: ఆదోని మున్సిపాలిటీలో కులగణన సర్వే పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి సర్వే బృందాన్ని కోరారు. శుక్రవారం సర్వే ప్రారంభమైంది. 42 వార్డుల పరిధిలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు బృందంగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. ఈ సర్వేలో ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా చేయాలని కమిషనర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పక్కాగా కులగణన సర్వే చేపట్టిందని, 1931 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వాలు కులగణన చేపట్టాయి. మళ్లీ 1941లో సర్వే ప్రారంభం కాగా, ఆ మధ్యకాలంలో రెండో ప్రపంచయుద్ధం రావడంతో సర్వే ఆగిపోయింది. 1941 తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ సర్వేను ప్రారంభించారని, లోపాలు లేకుండా జాగ్రత్తగా కులగణన సర్వే చేపట్టాలని కమిషనర్ సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలన్నారు. నిక్కచ్చిగా సర్వే చేసి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలన్నారు.

కులగణన సర్వే ప్రారంభం

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనన సర్వే మండలంలో శుక్రవారం ప్రారంభమైంది. బీఎల్‌ఓలు, వీఆర్‌ఓ, కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి ఆయా కులాలపై సర్వే చేపట్టారు. కామవరం గ్రామంలో సర్వే తీరును ఎంపీడీఓ సుబ్బారాజు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కులగణనన సర్వేను పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులకు దిశానిర్దేశం చేశామని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ సర్వేను పూర్తి చేస్తారని చెప్పారు.



ఇందిరానగర్‌లో సర్వే చేస్తున్న అడ్మిన్ సెక్రటరీ నితీష్‌కుమార్



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్బారాజు

టాపర్లకు బంగారు పతకాలు



విద్యార్థులకు సర్టిఫికెట్, బంగారు పతకం అందజేస్తున్న అధికారులు

ఆదోనిఅర్బన్: తల్లిదండ్రులు విద్యార్థులకు ఇష్టమైన రంగాల్లో వారిని ప్రోత్సహించాలని గచ్చిబౌలి డివిజన్ ఐఆర్‌ఎస్ డిప్యూటేషన్ కమిషనర్ నాగరాజు, డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ అధికారి రామాంజనేయులు సూచించారు. శుక్రవారం శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కో-ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు రాచోటి రామయ్య ఆధ్వర్యంలో ఆదోని మండలంలోని వివిధ విద్యాసంస్థల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఈడీ, ఇంజినీరింగ్, పోస్టుగాడ్యుయేషన్, పాలిటెక్నిక్, ఒకేషనల్ కోర్సుల్లో మొదటిస్థానం సాధించిన 51 మందికి 24 క్యారెట్ల ఒక గ్రాము బంగారు పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల అభిరుచులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తుండాలన్నారు. వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహించాలన్నారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, బ్యాంకు సీఈఓ గట్టు మురళీ, వైస్ చైర్మన్ లక్ష్మినారాయణ, డైరెక్టర్ ఆర్‌ఎస్‌జీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నందవరం: ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో నిర్మించిన నాగలదిన్నె బ్రిడ్జిపై చెక్‌పోస్టు వద్ద అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. చెక్‌పోస్టులో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా ముగతి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ స్కూటీలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. నిందితుడి నుంచి కర్ణాటక మద్యం 192 జాన్స్ ఒరిజనల్ ఛాయస్ డీలెక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు (90 ఎంఎల్)ను స్వాధీనం చేసుకున్నామన్నారు. స్కూటీని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అత్యాచార నిందితుడి అరెస్టు

పత్తికొండ రూరల్/దేవనకొండ: దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామంలో ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు కేదారిగాళ్ల మునిరంగడును శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. స్థానిక కార్యాలయంలో డీఎస్పీ మాట్లాడుతూ కోటకొండ గ్రామంలో ఈనెల 12న చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన కేసులో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా దేవనకొండ బస్టాండు వద్ద ఎస్‌ఐ భూపాలుడు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కేసు పూర్తి ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పుచ్చకాయలమాడ గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న బోయబాలరాజును శుక్రవారం అరెస్టు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. నిందితుడి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నాట్లు చెప్పారు.

నేడు పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ప్రముఖ చారిత్రక నవలా రచయిత ఎస్.డి.వి. అజీజ్ రచించిన 'అల్లూరి సత్యనారాయణ రాజు' నవల హిందీ అనువాదం పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం 6 గంటలకు విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో జరుగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పూర్వ శాసన మండలి సభ్యులు ఎం.వి.వి.ఎస్.శర్మ, అల్లూరి సత్యనారాయణరాజు సోదరులు ప్రముఖ న్యాయవాది అల్లూరి సీతారామరాజు అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



టాస్ వేస్తున్న ఎంపీడీఓ



కబడ్డీ ఆడుతున్న క్రీడకారులు

కౌతాళం: గెలపోటములను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలని ఎంపీడీఓ సుబ్బారాజు పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర పోటిల్లో భాగంగా శుక్రవారం మండల స్థాయి మ్యాచ్‌ల్లో కబడ్డీ ఫైనల్ పోటీలు జరిగాయి. కౌతాళం– బాపురం మధ్య పోటీలో కౌతాళం-2 విజేతగా నిలిచింది, క్రికెట్ పోటీల్లో భాగంగా శనివారం ఫైనల్ పోటీ ఉంటుందని చెప్పారు. హాల్వి-కాత్రికి గ్రామాల జట్లు తలపడతాయని, దీంతో మండల స్థాయి పోటీలు ముగుస్తాయన్నారు.

ఆరోగ్య సురక్షతో గ్రామంలోకే నాణ్యమైన వైద్యం



కామవరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు



శిబిరానికి హాజరైన ప్రజలు

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్షతో గ్రామంలోకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని కౌతాళం సింగల్ విండో మాజీ అధ్యక్షుడు వీరసేన రెడ్డి, తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు పేర్కొన్నారు. మండలంలోని కామవరం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంను శుక్రవారం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఇమ్రాన్, ప్రణీత, ఇందుప్రియ, కార్యదర్శి శివప్ప, వీఆర్‌ఓ నరసింహ పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేద్దాం




అధికారులు, స్థానికులతో సమావేశమైన పీఠాధిపతి

మంత్రాలయం : అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా మంత్రాలయంలో ఈనెల 22వ తేదీన జరిగే శోభాయాత్రను విజయవంతం చేయాలని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గురురాంజగన భవనంలో శ్రీమఠం అధికారులు, వ్యాపారులు, స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పీఠాధిపతి మాట్లాడుతూ స్థానిక 36 అడుగుల శ్రీ అభయరామ సన్నిదానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పురవీధుల్లో జరిగే శోభాయాత్రలో పాల్గొనాలని కోరారు. మఠం ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్ ఎస్‌కె శ్రీనివాస రావు, శ్రీమఠం అధికారులు పాల్గొన్నారు.

కోసిగి: ఈనెల 22వ తేదీన అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో శ్రీ సీతరాముల శోభాయాత్ర నిర్వహించనున్నారు. శుక్రవారం శోభయాత్రకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన నగదును వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి వారికి అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, మండల నాయకులు నాడుగేని నాగరాజు, బసిరెడ్డి, ముకుంద కృష్ణ మూర్తి, చింతకుంట ఈరన్న, భీమయ్య పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసి రైల్వే పోలీసులు కోర్టుకు పంపారు. ఎస్‌ఆర్‌పీ ఆదేశాల మేరకు ఆదోని మీదుగా రాకపోకలు సాగిస్తున్న రైళ్లలో రైల్వే పోలీసులు శుక్రవారం తనిఖీ చేపట్టారు. రైలు నంబర్ 22159 ఎక్స్‌ప్రెస్ రైలులో ఆదోనికి చెందిన బోయ ఉదయ్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురు 6 లగేజీ బ్యాగులలో కర్ణాటక మద్యాన్ని తీసుకెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 1,536 కర్ణాటక ఒరిజినల్ చాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.62000 ఉంటుందని ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని నిందుతులను కోర్టుకు పంపినట్లు చెప్పారు. రైళ్లలో ఎవరైనా అక్రమంగా నిషేధిత వస్తువులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో హెడ్ కానిస్టేబుల్ సాయి పోలీసులు గాదిలింగ, ఉసేని, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు



ఉద్యోగుల నుంచి వినతులను స్వీకరిస్తున్న డీఆర్వో కె.మధుసూధన్‌రావు

కర్నూలు(సెంట్రల్) : ఉద్యోగుల స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంతృప్తికర పరిష్కారాలు చూపేందుకు చర్యలు తీసుకోవాలని డీఆర్వో కె.మధుసూదన్‌రావు జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉద్యోగుల స్పందనను డీఆర్వో అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఉద్యోగుల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఏదైనా కారణంతో పరిష్కారం చేయలేకపోతే అందుకు తగిన కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

కర్నూలు కల్చరల్ : 2024 సాధారణ ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీ సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి కుమారి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, వివిధ ఇంజినీరింగ్ శాఖల అధికారులతో మాట్లాడారు. ఈనెల 27వ తేదీ లోపు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పని పురోగతికి సంబంధించి ఫొటోలను ఏపీసీకి వాట్సాప్ చేయాలని సూచించారు.

శ్మశానవాటిక హద్దులు చూపండి



మాట్లాడుతున్న కేవీపీఎస్ నాయకులు

ఆదోనిరూరల్: మండలంలోని సంతెకూడ్లరు గ్రామంలో దళితుల శ్మశాన వాటికను కేవీపీఎస్ బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప, గ్రామ అధ్యక్షులు పరమేష్ మాట్లాడుతూ.. గతంలో ఎన్నోసార్లు అధికారులకు శ్మశాన స్థలాన్ని కేటాయించాలని వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. అయితే దళితులకు శ్మశాన స్థలం కేటాయించారు గానీ ఆ స్థలానికి హద్దులు చూపించడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని వాపోయారు. ఎన్నోసార్లు తహసీల్దార్, మండల సర్వేయర్ దృష్టికి తీసుకెళ్లినా ఈరోజు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ స్పందించి శ్మశానవాటిక హద్దులు చూపించాలని కోరారు. కేవీపీఎస్ నాయకులు ఈరన్న, మధు, శివయ్య, మత్తయ్య పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద సీఐ తనిఖీలు

నందవరం: వాహనాలలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని నాగలదిన్నె బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో ఎస్‌ఐ తిమ్మయ్య నేతృత్వంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్ర, తెలంగాణ సరిహద్దులో ఏర్పాటు చేసిన నాగలదిన్నె వంతెన వద్ద ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే జైలుకు పంపుతామన్నారు. అక్రమ మద్యం, ఇసుక, నగదు రవాణాను అరికట్టే నేపథ్యంలో తనిఖీలు నిర్వహించామన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే చెక్‌పోస్టు వద్ద పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు తగ్గడమే గాకుండా, భూమి సారవంతమవుతూ అధిక దిగుబడులు వస్తున్నాయని ప్రయోగాత్మకంగా నిరూపితమైనట్లు ప్రకృతి వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అధికారి షేక్ మాబువలి అన్నారు. ఆయన శుక్రవారం మండల పరిధిలోని బోయనపల్లె గ్రామంలో వీహెచ్ఏ పుల్లయ్య, రైతుల సమక్షంలో ప్రకృతి వ్యవసాయం, రసాయనాల వినియోగంతో సాగుచేసిన పొలాల్లో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు.